
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 సిద్దిపేట

శుక్రవారం 10 జనవరి 2025

దుద్దెడ గురుకుల పాఠశాలలో..

ఇక్కట్లు ఇంతింత కాదయా..!

- నెలకు సుమారు రూ.లక్షన్నర అద్దె చెల్లింపు
- పగిలిన కిటికీల అద్దాలు.. డోర్లు లేని గదులు
- తలుపులు లేని స్నానాల గదులు

6లో

సంగారెడ్డి ఎర్దనూరు చౌడమ్మ జాతరలో జగ్గారెడ్డి



గుట్ట మీద చౌడమ్మ తల్లిని దర్శించుకుంటున్న జగ్గారెడ్డి, చెర్యాల ఆంజనేయులు



గుట్ట మీద చౌడమ్మ తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఎర్ధనూరు శివారులో ఉన్న చౌడమ్మ జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. గురువారం జరిగిన ఈ జాతరలో పాల్గొన్న జగ్గారెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. జగ్గారెడ్డికి ఆలయ పూజారులు అపూర్వ స్వాగతం పలికారు. జాతరకు వచ్చిన భక్తులతో పాటు జగ్గారెడ్డి స్టెప్పులు వేస్తూ ఉత్తేజ పరిచారు.

హాస్టల్‌ను సందర్శించిన జిల్లా జడ్జి

- విద్యార్థులను పీడీ చితకబాదిన ఘటనపై ఆరా

కొండపాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం దుద్దెడలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సిద్దిపేట జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి స్వాతిరెడ్డి గురువారం సందర్శించారు. బుధవారం విద్యార్థులను పీడీ చితకబాదడం, ఆస్పత్రిలో చికిత్స అందించిన విషయాన్ని తెలుసుకుని పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సంఘటనపై మాట్లాడారు. అరగంట ఆలస్యమైనందుకు తమను పీడీ కొట్టాడని విద్యార్థులు న్యాయమూర్తికి వివరించారు. ఇది మొదటిసారి జరిగిందని, పీడీ వాసు తమకు వద్దంటూ విద్యార్థులు జడ్జికి విన్నవించారు. అనంతరం ఆమె హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. స్నానాల గదులు, మరుగుదొడ్లు దుర్గం ధం వెదజల్లుతున్నాయని ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేయనున్నట్లు చెప్పారు.



విద్యార్థులతో మాట్లాడుతూ దెబ్బలను పరిశీలిస్తున్న జడ్జి స్వాతిరెడ్డి



విద్యుత్ దీపాలతో అలంకరించిన సిద్దిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

ముక్కోటికి ఆలయాలు ముస్తాబు

- ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు
- పోలీసుల బందోబస్తు

సిద్దిపేట కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం వేకువ జామునుంచే దర్శనాలకు అనుమతిస్తారు. సిద్దిపేట మోహినిపురలోని పద్మావతి సమేత వేంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యూలైన్ల కోసం బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ అనువంశిక చైర్మన్ రమేష్ విష్ణు, ఆలయ కార్యనిర్వహణ అధికారి పారునంది విశ్వనాథశర్మ, ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, కృష్ణమాచార్యులు ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్, క్యూలైన్లకు సంబంధించి వివరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు, సిబ్బందితో సిద్దిపేట ఏసీపీ మధు సమావేశం నిర్వహించారు. దాదాపు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటారని ఏసీపీ మధు తెలిపారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి చేస్తున్న ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ పర్యవేక్షించారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, నాయకులు దేవులపల్లి యాదగిరి, లక్ష్మీ, గోపీ కృష్ణ, రాజిరెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, జనార్ధన్ రెడ్డి, అంజిరెడ్డి, నవీన్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థి



. గజ్వేల్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్దిపేట జిల్లా నుంచి 18 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు, 14 సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు, ఒక టీచర్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.వికాస్, గైడ్ టీచర్ హఫీజ్ సారథ్యంలో చేపట్టిన ప్రదర్శన జాతీయ స్థాయికి ఎన్నికైంది. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యుడు అనిరుధ్‌రెడ్డి, ఆ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయిని వారిని ప్రశంసాపత్రం, మెమోంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, అహ్మదీపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణాకర్, మండల విద్యాశాఖ అధికారి కృష్ణ వారిని అభినందించారు.

ఆ గట్టునుంటారా.. ఈ గట్టుకొస్తారా..?

అయోమయం.. గజ్వేల్ అధికార పార్టీ రాజకీయం

వర్గాలుగా విడిపోయిన నాయకులు

గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అయోమయ పరిస్థితి నెలకొన్నది. ఎప్పుడు ఎవరు ఏ గట్టునుంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది. నాయకులు, కార్యకర్తలు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పుట్టిన రోజులను పోటీ పడి జరిపించారు. ఇందులో ఆయా వర్గాల సందడి ప్రస్ఫుటంగా కనిపించింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో పర్యటించిన సందర్భంగా జరిగిన గొడవ అనంతరమైనా అధిష్టానం పెద్దలు పెద్దగా చొరవ చూపకపోవడంతో రచ్చ కొనసాగుతూనే ఉంది

- గజ్వేల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి)

- ఎవరు ఏ వైపున ఉంటారో తెలియని పరిస్థితి
- నియోజకవర్గంలో ఫ్లెక్సీల పంచాయితీ
- గొడవలకు దారితీస్తున్న వైనం
- ఆసక్తి చూపని పార్టీ పెద్దలు
- రానున్న స్థానిక ఎన్నికలపై ప్రభావం?



గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గంలో ప్రస్తుత పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎవరు ఏ గట్టునుండాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

కార్యకర్తల్లో అయోమయం

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నర్సారెడ్డికి చెందిన కార్యకర్తలు, అభిమానులు ఓ వర్గంగా ఏర్పాటై కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇదే నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావుకు మద్దతుగా కార్యకర్తలు, నాయకులు కార్యక్రమాలు చేపడుతున్నారు. జనవరి 1న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి జన్మదినోత్సవాలను ఆయన అనుచరులు నిర్వహించగా, జనవరి 5న టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు జన్మదిన ఉత్సవాలను ఆయన అభిమానులు నిర్వహించారు. ఈ క్రమంలోనే అనుకోకుండా ముందస్తుగా మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన ఉత్సవాలను గజ్వేల్ మండలం జాలిగామలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో, గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో, మాజీ సర్పంచ్ చిటుకుల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మనోహరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలోనే నర్సారెడ్డి ముఖ్య అనుచరులు మినహా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మైనంపల్లి హనుమంతరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంతో ఒక్కసారిగా గజ్వేల్ నియోజకవర్గంలో తాము ఏ గట్టున ఉండాలో అర్థం కావడం లేదని సగటు కాంగ్రెస్ కార్యకర్త ఆవేదన చెందుతున్నారు.

భిన్న స్వరాలు

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో ఆయన పార్టీకి చెందిన నాయకులు గజ్వేల్ నియోజకవర్గంలో వర్గాలుగా విడిపోయి కుమ్ములాడుకుంటున్నారు. ఇదంతా జరుగుతున్న అధిష్టానం పెద్దగా గజ్వేల్ నియోజకవర్గంపై ఫోకస్ పెట్టినట్లు కనిపించడం లేదు. దీంతో సాధారణ కార్యకర్తలు తమ పరిస్థితి ఏంటని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ వర్గానికి ఎక్కువ టికెట్లు ఇప్పించుకుంటామని ఒకరు చెబుతుంటే కాదు.. కాదు తమ వర్గానికే ఇప్పించుకుంటామని మరో వర్గానికి చెందిన నాయకులు చెబుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను ఢీకొట్టాలంటే అంతా సమన్వయంతో పోరాడితే నే సాధ్యమయ్యే ప్రస్తుత పరిస్థితిలో ఒకరిపై మరొకరు పోటీ చేసి వీరిని వీరే ఓడించుకునే అవకాశం ఉందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. పార్టీకి నష్టం వాటిల్లకముందే అధిష్టానం పెద్దలు చొరవ తీసుకొని వర్గాలుగా విడిపోయిన నాయకులను ఏకతాటిపైకి తీసుకురావాలని లేదంటే పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని వాపోతున్నారు.

పెరిగిన ఫ్లెక్సీ రాజకీయం

గజ్వేల్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఫ్లెక్సీ రాజకీయం పెరిగింది. ఆయా వర్గాలకు చెందిన నాయకులు తమ నాయకుల ఫోటోలతో భారీగా ఫ్లెక్సీలు వేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఏ ఫ్లెక్సీని ఎవరూ చింపినా అది పోలీసుల మెడకు చుట్టుకుంటుంది. ఎదుటివర్గానికి చెందిన నాయకులు తమ నాయకుడికి

మిగతా6వ పేజీలో...

నిర్లక్ష్యం..నిండు ప్రాణాలకు ముప్పు


- అతివేగం..మద్యం మత్తుతో జీవితాలు చిత్తు
- రోడ్డు భద్రతా నిబంధనలను పాటించని వాహనదారులు



5

మృతదేహానికి రీ పోస్ట్‌మార్టం

- ప్రైవేట్ ఆస్పత్రి నిర్లక్ష్యంతో చనిపోయిందని కుమార్తె ఫిర్యాదు
- నాలుగు నెలల తర్వాత కేసు



5

'ఉపాధిహామీ'లో అన్నీ అవకతవకలే

- సామాజిక తనిఖీలో వెలుగులోకి..
- వర్క్ ఐడీ బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై డీఆర్డీవో ఆగ్రహం



6

పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ మను చౌదరి
- ఎన్ఆర్ఈజీఎస్ 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పనులపై సమీక్ష

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పనులపై గురువారం కలెక్టర్ మనుచౌదరి కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, సీసీ రోడ్డు తదితర పనులు చేపట్టినట్లు చెప్పారు. అందులో ఇప్పటి వరకు అనుమతులు పొందిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణ పనులకు భూ సమస్యలు ఉన్న వాటి వివరాలు అందించాలన్నారు. ఇంకా ప్రారంభించాల్సిన పనుల వివరాలు అందించాలని, పనులకు అదనంగా నిధులు అవసరమైతే వాటి వివరాలను తెలియజేయాలని చెప్పారు. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపడుతున్న సబ్ సెంటర్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, పనుల పురోగతిని ప్రతివారం సమీక్షిస్తానని, అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే కొన్ని నిర్మాణ పనులు ప్రారంభించగ వాటిని ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోగా పూర్తి చేయాలని అదే విధంగా టెండర్ దశలో ఉన్న వాటిని త్వరగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆయా శాఖల సిబ్బంది, పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ

ములుగు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చేస్తే రైతులకు అధిక లాభాలు వస్తాయని, అలాగే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కూడా ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు అనిల్‌కుమార్ కోరారు. గురువారం ములుగు రైతు వేదికలో మండలంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 12వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమార్, ఏవో ప్రగతి, ఏఈవోలు పృథ్వీరాజ్, అనూజ్ఞ, నివేదిత, మండల రైతులు, ప్రజా ప్రతినిధులు తదితరులుపాల్గొన్నారు.



మురిపెంగా ముగ్గుల పోటీలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. సుమారు 100 మందికి పైగా మహిళలు పోటీలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శాంతి, ప్రముఖ వైద్యురాలు అరుణ, కౌన్సిలర్ శ్రీదేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ముగ్గులను ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు బహుమతులను, పాల్గొన్నవారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ముగ్గుల పోటీలో ఎన్‌సీసీ పాల్గొన్న విద్యార్థినుల విన్నపం మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రూ.10వేల విరాళం అందజేశారు.

బావిలో పడి యువకుడి మృతి

నారాయణఖేడ్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చాప్టా.కెలో బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడని స్థానిక ఎస్ఐ శ్రీశైలం గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చాప్టా.కె గ్రామానికి చెందిన మేత్రి ఉమాకాంత్(29)కు కొన్నేళ్లుగా మతిస్థిమితం సక్రమంగా లేక గ్రామంలో రోడ్లపై తిరిగేవాడు. గ్రామ సమీపంలోని బావిలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడా లేక, తనంతట తాను బావిలో దూకాడా అన్న విషయం తెలియలేదు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామచంద్రాపురం టౌన్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శశికాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం డివిజన్ పరిధి కానుకుంట షాబాద్ హోటల్ ఎదురుగా సుమారు 55 ఏళ్ల వయసు ఉండే గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండగా, స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ నిర్వాహకులు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. కానుకుంటలో హనుమాన్ ఆలయం వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడని, ఆకలికి అలమటించి చనిపోయాడని పోలీసులు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంతర్రాష్ట్ర స్మగ్లర్‌కు రిమాండ్

జహీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గోవా మద్యాన్ని వివిధ రాష్ట్రాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ ఆరీఫ్‌ఖాన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ రమేష్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని ధార్‌జిల్లాకు చెందిన ఆరీఫ్‌ఖాన్ కొంతకాలంగా నిషేధిత మద్యాన్ని లారీల్లో, ఇతరత్రా వాహనాల్లో గుట్టుచప్పుడు కాకుండ పెద్దమొత్తంలో తరలిస్తున్నాడు. అతడిపై జహీరాబాద్, చేవెళ్ల, కుత్బుల్లాపూర్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. న్యాయస్థానానికి హాజరుకాకుండ తప్పించుకు తిరుగుతున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ ఆరీఫ్‌ఖాన్‌ను పట్టుకునేందుకు నిఘా పెంచాం. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులందరూ మూకుమ్మడిగా ఈ నెల 8న గోవాకు వెళ్లి అక్కడ వాల్‌పాయ్ పోలీసుస్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. గురువారం జహీరాబాద్‌కు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరుపరుచామని, నిందితుడు ఆరీఫ్‌ఖాన్‌కు రిమాండ్‌కు తరలించామని పోలీసులు వివరించారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

గజ్వేల్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొల్గూరుకు చెందిన మహిళ అంబులెన్స్‌లోనే ప్రసవించింది. గ్రామానికి చెందిన రమ్య(22)కు పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రాజు, పైలట్ సీహెచ్ మహిపాల్ గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ప్రసవం చేశారు. రమ్య పండండి మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో సిద్దిపేట విద్యార్థినులకు పతకాలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు సత్తా చాటారు. రెండు బంగారు, ఒక సిల్వర్ పతకాన్ని సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-16, అండర్-19 విభాగాల్లో సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు పి.రవళి, కె.హర్షిత బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. సైక్లింగ్ అండర్-16 విభాగంలో బి.కావ్య సిల్వర్ మెడల్ సాధించింది. ప్రతిభ చాటిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలో పాల్గొనున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డి.హిమబిందు, అధ్యాపక బృందం అభినందించారు.

ధరణితో మా భూములు పోయాయి..

● గిరిజన రైతుల ఆవేదన

పంజాగుట్ట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములు పోయాయని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామ పంచాయతీలోని కొండకల్ తండా, సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం వెలిమల తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ బాధిత గిరిజన రైతులతో కలిసి మాట్లాడారు. భూస్వాముల చేతుల్లో ఉన్న భూముల్లో అప్పట్లో సీలింగ్‌యాక్ట్‌తో ప్రభుత్వానికి స్వాధీనమయ్యాయని తెలిపారు. ఆ భూములను ప్రభుత్వం నుంచి గిరిజనులు అప్పటి కొనుగోలు చేసి, సాగు చేసుకుంటుండగా, ధరణి చట్టంతో ఆభూములు మళ్లీ వారి పేర్లతో ఆన్‌లైన్‌లో దర్శనమిస్తున్నాయని వాపోయారు. ఇదే అదనుగా ఆనాటి భూస్వాముల వారసులు తమను గెంటివేశారని ఆరోపించారు. దాదాపు 250 కుటుంబాలకు చెందిన 600 ఎకరాలు వారి అధీనంలోకి వెళ్లాయని, ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో పౌల్ట్రీఫాం యజమాని ఆత్మహత్య

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతోపాటు తండ్రి పేరిట ఉన్న భూమి తన పేరిట పట్టా మార్పిడి కావడం లేదన్న మనస్తాపంతో పౌల్ట్రీఫాం యజమాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. గురువారం ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. తుజాల్‌పూర్‌కు చెందిన కొట్టుముక్కల యాదగిరి(52) తన పొలంలో పౌల్ట్రీఫాం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. దానికి చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. తండ్రి పేరిట ఉన్న పొలం తన పేరు మీద పట్టా మార్పిడికి ప్రయత్నించగా కాకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి పౌల్ట్రీఫాంలో ఉరేసుకుని చనిపోయాడు. యాదగిరి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహానికి రీపోస్ట్‌మార్టం

- ప్రైవేట్ ఆస్పత్రి నిర్లక్ష్యంతో చనిపోయిందని కుమార్తె ఫిర్యాదు
- నాలుగు నెలల తర్వాత కేసు



పోస్టుమార్టం చేసేందుకు వచ్చిన తహసీల్దార్, గాంధీ ఆస్పత్రి వైద్యులు

రామాయంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్లక్ష్యంతోనే తన తల్లి చనిపోయిందంటూ కూతురు ఆలస్యంగా ఫిర్యాదు చేయగా, మృతదేహాన్ని పూడ్చిపెట్టిన నాలుగు మాసాల తర్వాత రీపోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామానికి చెందిన రాగిచిన్నవల్లోళ్ల లక్ష్మి(48) నాలుగు నెలల క్రితం కళ్లు తిరిగి పడిపోగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అయితే, అప్పట్లో లక్ష్మి బ్రెయిన్‌డెడ్ అయిందంటూ వైద్యులు తెలిపారు. సుమారు రూ.2 లక్షల బిల్లు వసూలు చేశారు. డబ్బు చెల్లించి మృతదేహాన్ని తీసుకొచ్చి సుతార్‌పల్లిలో పూడ్చిపెట్టారు. నాలుగు నెలల తర్వార లక్ష్మి కూతురు అశ్విని హైదరాబాద్‌లోని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తల్లి మృతదేహానికి మళ్లీ పోస్టుమార్టం నిర్వహించాలని కోరగా, గురువారం గాంధీ ఆస్పత్రి వైద్యులు, స్థానిక తహసీల్దార్ రజని సమక్షంలో రీపోస్టుమార్టం నిర్వహించారు.

350 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న కంటైనర్

మునిపల్లి, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న 350 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి కంటైనర్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా మునిపల్లి కంకోల్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. కంటైనర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదాశివపేట సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సుజాత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు.

ఆర్టీఐ సీజ్ చేసిన వాహనాల పార్కింగ్‌లో చెలరేగిన మంటలు

- నాలుగు ఆటోలు, కారు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సాపూర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ అధికారులు వివిధ సందర్భాలలో సీజ్ చేసిన వాహనాలను నర్సాపూర్ ఆర్టీసీ డిపోలోని ఓ ఖాళీ స్థలంలో నిలిపారు. అయితే, వాహనాలు ఉన్న చోట గురువారం ఉదయం ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అది గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారమివ్వగా వారు వచ్చి మంటలు ఆర్పారు. అయితే అప్పటికే నాలుగు ఆటోలు, కారు దగ్ధమైంది. ఈ మంటలు అంటుకోవడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

చలి@ 6.9 డిగ్రీలు

- మరింత పడిపోయిన ఉష్ణోగ్రతలు
- కోహీర్‌లో తొమ్మిది రోజులుగా అత్యల్పంగా నమోదు



కోహీర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా గజగజ వణికిపోతున్నది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగగా, గురువారం మళ్లీ పడిపోయాయి. బుధవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో మాత్రమే సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రత నమోదవగా, గురువారం మాత్రం ఉమ్మడి జిల్లాలో పదిహేడు చోట్ల నమోదయ్యాయి. ఎప్పటిలాగే కోహీర్‌లో అత్యల్పంగా 6.9 డిగ్రీలు నమోదైంది. మళ్లీ ఐదారు రోజుల క్రితం కనిష్ఠాన్ని తాకింది. రెండు రోజుల క్రితం 9 డిగ్రీలు, బుధవారం 8.8 డిగ్రీలుండగా గురువారం మళ్లీ పడిపోయింది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత విపరీతంగా పెరుగుతూనే ఉంది. సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో, మెదక్ జిల్లా దామరంచలో 9.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


సంగారెడ్డి జిల్లాలో.. కోహీర్‌లో 6.9, న్యాల్‌కల్‌లో 7.4, కంగ్టిలో 8.6, అల్లోల్‌లో 8.8, ఝరాసంగంలో 9.1, మునిపల్లిలో 9.2, కంలోల్‌లో 9.2, నల్లవల్లిలో 9.2, మల్చల్మలో 9.2, అల్మాయిపేట్‌లో 9.5, నిజాంపేట్‌లో 9.6, సిర్గాపూర్‌లో 9.7 లక్ష్మీసాగర్‌లో 9.9, జహీరాబాద్‌లో 10.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో.. దామరంచలో 9.7, మనోహరాబాద్‌లో 9.9, కొల్చారంలో 9.6, బోడగట్‌లో (ఈఎస్ఎస్) 10.0, శివ్వంపేటలో 10.3, నర్సాపూర్‌లో 10.2, శంకరంపేటలో 10.8, డి.ధర్మారంలో 10.9 డిగ్రీలు

సిద్దిపేట జిల్లాలో.. అంగడికిష్టాపూర్‌లో 9.7, పోతిరెడ్డిపేటలో 10.2, కొండపాకలో 10.3, చిట్యాల్‌లో 10.3, హబ్సీపూర్‌లో 10.5, రేబర్తిలో 10.7, చీకోడ్‌లో 10.8, దౌల్తాబాద్‌లో 10.9, వెంకట్‌రావుపేట్‌లో 10.9, నంగనూరులో 10.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అంసాన్‌పల్లిలో రాతియుగం ఆనవాళ్లు

పనిముట్ల గుర్తింపు ● క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల గుర్తులు



ఆనవాళ్లను చూపిస్తున్న ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్

కొల్చారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామ శివారులోని పాత శివాలయం గుట్ట మీద నవీన రాతియుగం ఆనవాళ్లను గురువారం ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, లైబ్రేరియన్ బుర్ర సంతోష్ గుర్తించారు. ఆనాటి ఆదిమానవులు ఆహార వేటలో భాగంగా ఉపయోగించిన రాతి పనిముట్లు, పదును చేయడానికి నూర్చిన నూరుడుగుంతలు (గ్రూవ్స్) కనుగొన్నట్లు తెలిపారు. ఈ ఆనవాళ్లను బట్టి ఈ ప్రాంతంలో క్రీస్తుపూర్వం 5000 సంవత్సరం నుంచి ఆదిమానవులు నివసించారని పేర్కొన్నారు. ఇదివరకే కాజీపల్లి ఉడుము గుట్టలు, జక్కన్నపేట నల్లగుట్ట, కుక్కునూరు బండలు, హస్తలాపూర్ గుట్టలలో పురాతన మానవుడి ఆడవాళ్లు, అప్పటి ఆదిమానవుల రాతి పెయింటింగ్‌లను గుర్తించామని తెలిపారు.



నిండు ప్రాణాలకు ముప్పు

- అతివేగం..మద్యం మత్తుతో జీవితాలు చిత్తు
- రోడ్డు భద్రతా నిబంధనలను పాటించని వాహనచోదకులు
- పోలీసులు పదేపదే చెబుతున్నా మారని తీరు

సంగారెడ్డి క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వాహనదారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలవుతున్నాయి. రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతుండడంతో పాదాచారులు, ద్విచక్రవాహనదారులకు ముప్పు వాటిల్లుతోంది. పోలీసులు పదేపదే చెబుతున్నా మద్యం తాగి ఇష్టారీతిగా తోలుతున్నారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నా తీరు మారడం లేదు. ఈ గతేడాది సంగారెడ్డి జిల్లాలో మొత్తం 852 రోడ్డు ప్రమాదాలు జరగగా 384 మృతి చెందారు. 913 మంది క్షతగాత్రులయ్యారు.

2024 వివరాలు	
రోడ్డు ప్రమాదాలు	852
మృతులు	384
క్షతగాత్రులు	913
వాహన తనిఖీలు, కేసులు	1,94,888
జరిమానాలు	రూ.7,78,47,962

రోడ్డు విస్తరణ పనులు

65వ నంబర్ హైవే ప్రధానంగా సంగారెడ్డి జిల్లా మీదుగానే ఎక్కువగా ఉంటుంది. ఇది హైదరాబాద్-ముంబై జాతీయ రహదారి కావడంతో ప్రతీరోజూ భారీ వాహనాలు వేల సంఖ్యలో తిరుగుతుంటాయి. ముఖ్యంగా షిర్డీ, ముంబైలకు ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువగా వెళ్తుంటాయి. జిల్లాలో పరిశ్రమలు కూడా ఎక్కువగానే ఉండటంతో భారీ వాహనాలు దీని గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. నాలుగు లేన్లుగా ఉన్న ఈ రహదారిని ప్రస్తుతం ఆరు లేన్ల రోడ్డుగా విస్తరిస్తున్నారు. పనులు కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.



జహీరాబాద్ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదం (ఫైల్)

మద్యం మత్తులో డ్రైవింగ్

65వ నంబర్ జాతీయ రహదారిపై వందలాది వాహనాల రాకపోకల కారణంగా పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ వరకు రోడ్డుకు ఇరువైపులా దాబాలు, రెస్టారెంట్లు అనేకం వెలిశాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వీటిని నిర్వహిస్తున్నారు. కొన్ని దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఈదారి గుండా ఎప్పుడు వేళ్లే వాహనదారులకు మద్యం సిట్టింగ్‌లు ఎక్కడ కొనసాగుతున్నాయో అందరికీ తెలుసు. మద్యం సిట్టింగ్‌ల అనంతరం మత్తులోనే వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులను, ద్విచక్రవాహనదారులను గుద్ది వెళుతున్నారు. హైవే పక్కన పెట్రోల్ బంకుల వద్ద భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అనధికారికంగా పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు అతివేగంగా వచ్చి పార్కింగ్ చేసి ఉన్న భారీ వాహనాలను చూసుకోక వెనుకవైపు నుంచి ఢీకొడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. డాబాలు, రెస్టారెంట్లు, సిట్టింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో భారీ వాహనాలను రహదారి పక్కనే గంటలతరబడి పార్కింగ్ చేస్తున్నారు. హైవే అథారిటీ స్పందించాల్సిన అవసరం ఉంది. అలాగే ఎక్కడికక్కడ పోలీసులు రోడ్డు పక్కన పార్కింగ్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఇటీవల మొబైల్ ఈ బైక్‌లను ప్రారంభించాం. అలాగే సంగారెడ్డి, పటాన్‌చెరు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి తాత్కాలిక బోలార్డ్స్, ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేశాం. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వాహనాల అతివేగం, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. జాతీయ రహదారులపై ప్రయాణం చేసే టప్పుడు జాగ్రత్తగా వాహనాలు నడపాలి. జాతీయ రహదారులపై అవసరమైన చోట యూటర్న్‌లు చేయడం, అవసరం లేని చోట యూటర్న్‌లను మూసివేయడం జరిగింది.

\- చెన్నూరి రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

బ్లాక్‌స్పాట్లు ఇవే...

సంగారెడ్డి జిల్లాలో 65వ నంబరు జాతీయ రహదారిపై పోలీసులు కొన్ని బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్, ముత్తంగి, సమీపంలోని స్వీట్‌హార్ట్ హోటల్, ఇస్నాపూర్ చౌరస్తా, లక్డారం గేట్, నేవాపాన్ చౌరస్తా, రుద్రారం గ్రామాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవలంపేట, కంది, జమ్‌జమ్ దాబా, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా, సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేట ఆర్టీసీ బస్టాండ్, నందికంది, ఎంఆర్‌ఎఫ్ కాలనీ, కోహీర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగ్వాల్, సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.

ప్రమాదాల నివారణకు హైవే 44 దత్తత

- ప్రథమ చికిత్సపై పోలీసు, రవాణ శాఖకు సేవ్ లైఫ్ ఫౌండేషన్ శిక్షణ

తూప్రాన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారి 44ను సేవ్ లైఫ్ ఫౌండేషన్ దత్తత తీసుకున్నది. గురువారం మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ గురుకులంలో తూప్రాన్ పోలీసు సబ్‌డివిజన్ పరిధి శిక్షణ నిర్వహించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సేవ్ లైఫ్ ఫౌండేషన్ సహాయం జాతీయ రహదారి 44పై ప్రమాదాల నివారణకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. హైవే 44 మీదుగా అతివేగంగా ప్రయాణించే వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ జనరేట్ అయ్యే విధంగా ఏఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైవేపై రోడ్డు ఇంజనీరింగ్ డిఫెక్ట్ ప్రదేశాలను గుర్తించి సరిచేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. శిక్షణలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐలు శివానందం (తూప్రాన్), సుభాష్‌గౌడ్ (మనోహరాబాద్), రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకే ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ పాపన్నపేట మండలం చీకోడు జిల్లా పరిషత్ హైస్కూల్, షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ముందుగా విద్యార్థుల భోజనశాలను, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. మెను అమలు తీరును హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో కలెక్టర్ టీచర్‌గా మారి పాఠాలు బోధించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రభుత్వ బడుల్లో గ్రంథాలయాల ఏర్పాటు అభినందనీయం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

గజ్వేల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. గురువారం గజ్వేల్‌లో టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డితో కలిసి హాజరయ్యారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని డాక్టర్ రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు సంప్రదాయ విద్యపై మంచి పట్టు ఉంటుందని, లైబ్రరీలతో పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర ప్రపంచస్థాయి అంశాల పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా సామాజిక సేవలు విస్తృతం చేసిన టీవైఆర్ ఫౌండేషన్ రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు దక్కించుకున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న లైబ్రరీల ద్వారా విద్యతోపాటు పోటీ పరీక్షల్లో సైతం నైపుణ్యత ప్రదర్శించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీవై రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, టీవైఆర్ ఫౌండేషన్ సభ్యులు ప్రభావతి, విజయలక్ష్మి, రోహిత్, రాహుల్, సత్యనారాయణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను చూపిస్తున్న రియాజ్, తదితరులు

యూనిఫాంలు బాగున్నాయి

మర్కుక్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల యూనిఫాం బాగున్నాయని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ టీవైఆర్ ఫౌండేషన్‌ను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు ఇలా పనిచేస్తే ఇక కార్పొరేట్ పాఠశాలలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో అంగడి కిష్టాపూర్ ప్రధానోపాధ్యాయులు బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చేర్యాలపట్టణంలోని నర్మెట్ట బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మన్విచంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత డిసెంబరు 21 నుంచి వచ్చే ఫిబ్రవరి-1వ తేదీ వరకు 4వతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఫిబ్రవరి 23న పరీక్ష ఉంటుందన్నారు. అలాగే 6,7,8,9 తరగతులలో ఖాళీల భర్తీకి కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అటవీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

ములుగు, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అటవీ కళాశాల పరిశోధన సంస్థలో ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. శ్రీనిధి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆటవీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర పరీక్షలు, రక్తనమూనా పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు

ధూళిమిట్ట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.4.26కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయనీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు.

దుద్దెడ గురుకుల పాఠశాలలో.. ఇక్కట్లు ఇంతింత కాదయా..!



గదులకు తలుపులు లేక చలికి తట్టుకునేలా చాపలు కట్టిన దృశ్యం, అద్దాలు పగిలిన కిటికీలు

- నెలకు సుమారు రూ.లక్షన్నర అద్దె చెల్లింపు
- అద్దాలు పగిలిన కిటికీలు.. డోర్లు లేని గదులు
- తలుపులు లేని స్నానాల గదులు
- చలి,దోమలతో విద్యార్థులకు ఇబ్బందులు

కొండపాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కుటుంబాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వాలు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే గురుకులాల్లో విద్యార్థులకు సరైన వసతులను కల్పిస్తూ, పౌష్టికాహారాన్ని కూడా అందజేయడం ప్రభుత్వ ఉద్దేశ్యం. అయితే కొన్ని ప్రాంతాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురుకులాలకు సొంత భవనాలు లేకపోగా, అద్దెభవనాల్లో కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇక్కట్లు అంతా ఇంతా కాదు.

అద్దె భవనంలో అన్నీ అవస్థలే..

కొండపాక మండలం దుద్దెడలో ఒక అద్దె భవనంలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల కొనసాగుతుంది. ఇందులో సుమారు 480 మంది విద్యార్థులు చదువుతున్నారు. కనీస వసతులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు . ప్రతినెలా సుమారు రూ.1.50లక్షలు అద్దె చెల్లిస్తున్నప్పటికీ వసతులు లేకుండానే కొనసాగించడం గమనార్హం.

డోర్లు లేవు.. కిటికీలు ధ్వంసం

భవనంలోని పలు గదులకు డోర్లు లేవు. డోర్లు లేకపోవడంతో చలికి తట్టుకునే విధంగా విద్యార్థులే చాపలను కట్టుకున్నారు. డోర్లు లేకుండా, కిటికీల అద్దాలు పగలడంతో చలికి విద్యార్థులు తట్టుకోలేకపోతున్నారు.

తలుపులు లేని స్నానాలు గదులు

విద్యార్థులు స్నానాలు చేసే గదులకు ఏ ఒక్క దానికి సైతం డోర్లు లేవు. అందులో నల్లాలు సైతం పని చేయక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్నానపు గదుల్లో ట్యాపులు సరిగా పనిచేయకపోవడంతో భవనం ఆవరణలో పెద్ద సంపు నుంచి నీటిని వాడుతున్నారు. ఇలా చేయడంతో స్నానాల గదుల ప్రాంతంలో అంత బురదమయంగా తయారయింది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారై దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ఎలుకలు పాములు వస్తున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనానికి అద్దె చెల్లిస్తున్నప్పటికీ కనీస వసతులు కల్పించకపోవడం అలాగే పాఠశాల నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.



తరగతి గది నిర్వహణ

ఒకే గదిలో వసతి, తరగతి

రాత్రి పడుకునే చోటే తరగతి గది నిర్వహిస్తున్నారు. పగటి పూట తరగతి గదిలో పాఠాలు చెప్తుండగా రాత్రికి అదే గదిలో విద్యార్థులు పడుకుంటున్నారు. విద్యార్థులు వారు తెచ్చుకున్న లగేజీ సైతం అందులోనే ఉండడం తరగతి గది నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో10 మందికి జరిమానా.. ఇద్దరికి జైలు

సిద్దిపేట క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారి తదితర ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. అదేవిధంగా వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తన సిబ్బందితో సిద్దిపేట పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న 10 మంది వాహనదారులను అదుపులోకి తీసుకున్నట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారిని సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 10 మందికి రూ.22వేల జరిమానా విధించారు. వారిలో ఒకరికి 2రోజులు, మరో వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.2.80కోట్లు

చేర్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మాట గ్రామశివారులోని వాగులో చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.80కోట్లు నిధులు మంజూరు చేసింది. ఏటా వర్షాకాలంలో దొమ్మాట శివారులోని వాగు నుంచి వరద నీరు వృథాగా ప్రవహిస్తున్న నేపథ్యంలో చెక్‌డ్యాం నిర్మాణానికి సంకల్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభానికి నోచని పనుల నిధులు నిలిపివేసింది. ఈవిషయమై నీటిపారుదలశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించడంతో ప్రభుత్వం ఆయా నిధులు మంజూరుచేస్తూ పనుల ప్రారంభానికి అనుమతులిచ్చిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కబ్జాకు గురైన చెరువు శిఖం భూమిలో సర్వే



కబ్జాకు గురైన చెరువు శిఖంభూమి హద్దులు చూపుతున్న అధికారులు

కుకునూరుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బాయిపల్లిలో ధర్మారెడ్డి చెరువు శిఖం కబ్జాకు గురైందని పలువురు గ్రామస్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ తహసీల్దార్‌తో పాటు నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు శాఖల అధికారులు మంగళవారం, గురువారం రెండు రోజుల పాటు ధర్మారెడ్డి చెరువు వద్ద గ్రామస్థుల సమక్షంలో సర్వే చేపట్టి చెరువు శిఖం కబ్జాకి గురైందని నిర్ధారించారు. కబ్జాకు గురైన ఎకరం 20 గుంటలను స్వాధీనం చేసుకొని హద్దులను చూపారు.

వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

● నేడు వైకుంఠ ఏకాదశి





సిద్దిపేటలో వేంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లు, గజ్వేల్‌లో వెయ్యికి పైగా పది పైసల నాణాలతో రూపొందించిన స్వామివారి శంకు చక్రం నామాలు

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశిగా కూడా వ్యవహరించే ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే విశేష పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వైష్ణవాలయాల్లో సాధారణ ద్వారం నుంచి కాకుండా ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకోవడం ఈ రోజు ప్రత్యేకత. దీంతో జిల్లాలోని వైష్ణవాలయాల్లో గురువారం నుంచే ఉత్తరద్వారా దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లను ప్రారంభించారు. పలుచోట్ల క్యూలైన్ల కోసం ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండపై శుక్రవారం స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తయ్యాయని వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరి కనకయ్య తెలిపారు. కొండపాక ఆనంద నిలయంలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ ద్వార దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం 5 గంటలకు ముక్కోటి ద్వార దర్శనంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని సిరిసినగండ్ల, దుద్దెడ వేణుగోపాలస్వామి తదితర ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. భద్రాచల దేవస్థాన ముక్కోటి ఏకాదశి ప్రత్యేక ఆహ్వాన పత్రికను గురువారం జగదేవ్‌పూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయం కమిటీ వారికి శ్రీరామకోటి భక్తసమాజం వ్యవస్థాపక, అధ్యక్షుడు రామకోటి రామరాజు అందజేశారు. కాగా రామకోటి కార్యాలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని 1998 సంవత్సరం నాటి పది పైసలు 1000కి పైగా ఉపయోగించి శంకు, చక్రం నామం చిత్రాలను సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు అద్భుతంగా రూపొందించి ఆవిష్కరించి భక్తిని చాటుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం నారాయరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులు, హైమాక్స్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, మండల అధ్యక్షుడు బర్మ రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నేరవేర్చాలి: బీఆర్ఎస్

సిద్దిపేట రూరల్,జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కోనయ్యగారి ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ హైమద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి అమలు ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఓయూ రిజిస్ట్రార్‌ను కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

గజ్వేల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్‌అంజుమ్ ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అటానమస్ విషయాన్ని వివరించి, పలు సలహాలను కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

గజ్వేల్/కుకునూరుపల్లి/మర్కుక్/దౌల్తాబాద్/దుబ్బాక/మిరుదొడ్డి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులను నియమిస్తూ గురువారం ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి అమర్‌నాథ్ సారంగుల ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ మేరకు గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన పంజాల అశోక్‌గౌడ్‌ను, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడిగా ముట్రాజ్‌పల్లికి చెందిన దేవులపల్లి మనోహర్‌యాదవ్‌ను నియమించారు. కుకునూరుపల్లి మండల అధ్యక్షుడిగా అనుముల సంపత్‌రెడ్డి, రాయపోల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా బేగంపేటకు చెందిన మంకిడి స్వామి, మర్కుక్ మండల అధ్యక్షుడిగా సాయిరెడ్డి రామ్‌రెడ్డి, దౌల్తాబాద్ మండల అధ్యక్షులుగా దేవుడి లావణ్య, దుబ్బాక మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడిగా ఎర్రగొల్ల శ్రీకాంత్‌ను, మిరుదొడ్డి బీజేపీ మండల అధ్యక్షుడిగా కొండాపూర్ గ్రామానికి చెందిన జిగిరి అమర్, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడిగా ఖాజీపూర్ గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, కాగా జగదేవ్ పూర్ మండల అధ్యక్షుడిగా ఇద్దరి మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ఈ నెల 11కు వాయిదా వేశారు.

విద్యార్థికి నగదు పురస్కారం

సిద్దిపేట రూరల్,జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణ గణిత ఫోరం నిర్వహించిన ప్రతిభాపరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఈర్ల సౌమ్యకు జక్కాపూర్ గ్రామవాసి ఎన్ఆర్ఐ మోసర్ల జానకి మాధవరెడ్డి గురువారం రూ.10వేలు పురస్కారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో మన పాఠశాల నుంచి మరింత మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆర్గానిక్ పంటలు సాగు చేయాలి

ములుగు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఆర్గానిక్ పంటల సాగుతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని నాబార్డ్ సీజీఎం ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ములుగులో సురక్ష రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు మందులు పిచికారి చేయడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని, రైతులందరినీ ఆర్గానిక్ పంట సాగుపై దృష్టి మళ్లించే విధంగా కృషి చేయాలని కోరారు. సురక్ష ఆర్గానిక్ ఉత్పత్తులు సొంత బ్రాండ్‌తో ప్యాకింగ్ చేసి ఆన్లైన్‌లో మార్కెటింగ్ అపార్ట్‌మెంట్స్ వారికి అమ్మకాలు మరియు సంస్థ యొక్క మూలధనం పెంచుకోవాలన్నారు.

బుగ్గరాజేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా కరుణాకర్

సిద్దిపేట రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీ పార్వతి బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ చైర్మన్, పాలకవర్గ సభ్యులను ప్రభుత్వం ప్రకటించిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. ఆలయ చైర్మన్‌గా భాగన్న కరుణాకర్ ముదిరాజ్, సభ్యులుగా బిట్ల శ్రీనివాస్, ఆకుల సంతోష్ కుమార్, రేమాల దేవయ్య, కుంభాల సరళ, బాలసాని ఉప్పలయ్య, సింగరి మహిపాల్ రెడ్డిలు నియమించినట్లు తెలిపారు.

11న ఇర్కోడు దర్గాలో ఉర్సు

సిద్దిపేట రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు శివారులోని హజరత్ సయ్యద్ సాదుల్లా హుస్సేని రహ్మతుల్లా అలై దర్గా ఉర్సె షరీఫ్ నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ రషీద్ గురువారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ముర్షద్ గడ్డ నుంచి గంధం బయలుదేరి సిద్దిపేటలోని ప్రధాన వీధుల గుండా రాత్రి 8:30 గంటలకు ఇర్కోడ్ దర్గాకు చేరుకుంటుందని తెలిపారు.


ఉచిత శిక్షణ కేంద్రాలతో మహిళలకు చేయూత



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్

సిద్దిపేట అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణ కేంద్రాలు మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నాబార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్ అన్నారు. సిద్దిపేటలో యూనియన్ బ్యాంకు, ఆర్‌సేటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరుగుతున్న మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి శిక్షణ తీసుకుంటున్న వారికి అవగాహన కల్పించారు. ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకొని మహిళలు ఎదగడానికి బ్యాంకులు కూడా సహాయ సహకారాలు అందిస్తాయని, లోన్స్ ద్వారా సొంత వ్యాపారం ఏర్పరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. శిక్షణ అనంతరం వ్యాపారాలను నడుపుకోవాలని తెలిపారు. శిక్షణ కేంద్రంలో ఉన్న వస్తువులను పరిశీలించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నిఖిల్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వికాస్, ఆర్‌సేటీ డైరెక్టర్ రాజలింగం, ఫ్యాకల్టీ నజీమ్ అలీ, నాగరాజు, సిబ్బంది స్వప్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

సేవాగుణం ఎంతో గొప్పది: డీఈవో



నంగునూరు: నర్మెట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న స్పోర్ట్స్ దుస్తులు

నంగునూరు/రాయపోల్/చేర్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సేవా తత్పరత ఎంతో గొప్పదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంగునూరు మండలం నర్మెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ లోహిత్ సాయి హాస్పిటల్ వైద్యులు, సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రొఫెసర్ డాక్టర్ అమిర్‌శెట్టి భాస్కర్ సహకారంతో విద్యార్థులకు రూ.30 వేల విలువ చేసే స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు. ప్రొఫెసర్ డాక్టర్ అమిర్ శెట్టి భాస్కర్ మాట్లాడుతూ తాను కూడా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఈ రోజు మంచి డాక్టర్ అయ్యానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంఈవో దేశిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా రాయపోల్ మండలంలోని అనాజీపూర్ ప్రాథమిక పాఠశాలకు సికింద్రాబాద్ రోటరీక్లబ్ సభ్యులు విక్రమ్ మెహెతా, సత్యసాయి సేవాసమితి బేగంపేట సభ్యులు కేవీఎస్ సాయికుమార్ 25 డెస్కులు అందజేశారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ మాజీ ఎంపీటీసీ శివశంకర్ గ్రామంలోని జడ్పీఎస్ఎస్‌కు రూ.60 వేల విలువైన ప్రహరీ గేటును విరాళంగా అందించారు.

ఆ గట్టునుంటారా.. ఈ గట్టుకొస్తారా..?

(3వ పేజీ తరువాయి)

చెందిన ఫ్లెక్సీలను చింపారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఓ వర్గానికి చెందిన ఫ్లెక్సీని మరొక వర్గానికి చెందిన నాయకుడు చింపడంతో పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించగా, ఆ వర్గానికి చెందిన నాయకుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి స్థానిక సీఐ ఎదుటే ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇటీవల సీఎం పర్యటన సందర్భంగా జరిగిన గొడవకు ఫ్లెక్సీల పంచాయతే ప్రధాన కారణం. ఇక ఒకేపార్టీ... పైగా అధికార పార్టీ... ఇద్దరిలో ఎవరికి సపోర్టు చేసినా మరోవర్గంతో తలబొప్పి కడుతుందని పోలీసులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఓ నాయకుడికి గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఏర్పడిన అగాధాన్ని సరిచేయాలని బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తుంది. సదరు నాయకుడి పుట్టినరోజు వేడుకలను నర్సారెడ్డి, ముఖ్య అనుచరులు మినహా మిగతా అందరూ కలిసి చేశారు.

పదేళ్ల తరువాత అధికారం వచ్చినా..

రాష్ట్రంలో పదేళ్ల పోరాటం అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని... కానీ తమకు అధికారం రాలేదని, తాము అధికారంలో ఉన్నామో... ఇంకా ప్రతిపక్షంలో ఉన్నామో తెలియని పరిస్థితి ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తల ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు వర్గాలుగా విడిపోవడం.. ఒకరిపై మరొకరు ఆధిపత్యం సాధించేందుకు యత్నిస్తుండడంతో తాము ఏమీ చేయాలో అర్థం కావడం లేదు. గతంలో మైనంపల్లి హనుమంతరావును నర్సారెడ్డే గజ్వేల్‌కు తీసుకొచ్చారు. ఇప్పుడు వారిద్దరికీ గిట్టడం లేదు. దీంతో నర్సారెడ్డి వ్యతిరేక వర్గం మైనంపల్లి హనుమంతరావుకు దగ్గరైంది. ఈ క్రమంలో గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. కొంతమంది నాయకులు నర్సారెడ్డితోనూ... మరికొందరు మైనంపల్లి హనుమంతరావుతో, ఇంకొందరు శ్రీకాంత్‌రావుతోనూ ఉంటున్నారు. ఇక పలువురు అందరితోనూ కలిసి ఉంటూ ముగ్గురితో కలిసి ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అసలు ఎవరు ఏ వర్గమో.. అసలు ఎవరు ఎవరికి మద్దతునిస్తున్నారో అర్థం కావడం లేదు. అధిష్టానం చొరవ తీసుకుని చక్కదిద్దాలి. లేనిపక్షంలో పార్టీ మరింతగా నష్టపోయే అవకాశం ఉంది.

విద్యాసంస్థలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



వర్గల్ కళాశాల ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు




గజ్వేల్‌లోని సరస్వతీ శిషుమందిర్‌లో ఫుడ్ ఫెస్టివల్ దృశ్యం

వర్గల్/గజ్వేల్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మైదానంలో భోగి మంటలు, రంగవల్లులు, గాలిపటాలతో వినోదాలు, పల్లెటూరి వాతావరణాన్ని తలపించేలా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గజ్వేల్ పట్టణంలోని స్థానిక శ్రీసరస్వతి శిషు మందిర్‌లో సంక్రాంతి పండుగ సంబరాలు ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించి ఆకట్టుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్/వర్గల్/హుస్నాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని గజ్వేల్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ క్రిస్టోఫర్ పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలో గురువారం వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలను గూర్చి ఆయన వివరించి, అనంతరం రోడ్డు భద్రతా ప్రతిజ్ఞను చేయించారు. వర్గల్ మండలం మజీద్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో గురువారం బేగంపేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో తొగుట సీఐ లతీఫ్ రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో స్కూల్ బస్సు డ్రైవర్లు, వ్యాన్ డ్రైవర్లకు రవాణా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో కొండలరావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘ఉపాధిహామీ’లో అన్నీ అవకతవకలే



మద్దూరు: ప్రజావేదికలో సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాలను వివరిస్తున్న పీఆర్పీలు

మద్దూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలో ఉపాధిహామీ పథకంలో 2023-24లో నిర్వహించిన పనుల్లో అన్నీ అవకతవకలే చోటుచేసుకున్నాయి. ఈ మేరకు విలేజ్ రిసోర్స్ పర్సన్స్ గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో బయటపడ్డ విషయాల్ని గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఆర్డీడీవో బాలకృష్ణ, క్యూసీ సంతోష్, ఏపీడీ శ్రీనివాస్, ఆడిట్ ఆఫీసర్ దత్తు, ఎస్ఆర్పీ రమేష్, పీఆర్ఏఈ వినయ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా నిర్వహించిన సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాలను వీఆర్పీలు చదివి వినిపించారు. పని ప్రదేశంలో కొలతలు తేడాలు, పని జరగకుండా డబ్బుల చెల్లింపులు, పని చేయకుండా కూలీలకు పేమెంట్స్ ఒకే కుటుంబంలో ఇద్దరికి జాబ్‌కార్డులు, ఒకరి పేరున మరొకరు చేసిన పనులతో పాటు పని ప్రదేశంలో ఏర్పాటు చేసే బోర్డులు లేకున్నా రూ. వేలాది బిల్లుల చెల్లింపులు జరిగినట్లు ప్రజావేదికలో బయటపడ్డాయి. పనిప్రదేశంలో వర్క్ఐడి తెలిపే బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై డీఆర్డీవో మండిపడ్డారు. వెంటనే వారి కాంట్రాక్ట్ రద్దు చేసి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. ఇక నుంచి జవాబుదారీగా ఉండే పంచాయతీల సెక్రటరీలకు అప్పగించాలని సూచించారు. అవకతవకలపై రికవరీకి ఆదేశించినట్లు డీఆర్డీవో తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

తొగుట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య హెచ్చరించారు. గురువారం తొగుట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకం 15 విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తొగుట మండలంలో 2023 ఏప్రిల్ 1 నుండి 2024 మార్చి 31 వరకు గ్రామాల్లో చేపట్టిన 350 పనుల వివరాలు, కూలీలకు చెల్లించిన వేతనం వివరాలు అడిగి ఆయన తెలుసుకున్నారు. సామాజిక తనిఖీలో ఉద్యోగ నిర్వాహణలో అలసత్వం వహించిన ఈజీఎస్ సిబ్బందికి రూ.26 వేల ఫైన్‌తోపాటు మస్టర్‌లలో తేడాలు, కొలతలలో తేడాలను గుర్తించి రూ. 52,077ను వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల అదుపు



తొగుట: లింగాపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్

తొగుట/దౌల్తాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. గురువారం తొగుట మండలం లింగాపూర్ గ్రామంలో గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటన జరిగిన సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొగుట సీఐ లతీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాల్లో దొంగతనాలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలతో సాధ్యపడుతుందన్నారు.